

ఓం గం గణపతయే..



- నేటి నుంచి వినాయక నవరాత్రులు
- సిద్ధమైన మండపాలు.. కొలువు దీరనున్న గణేషుడు
- పత్రి, పూల కొనుగోలుతో మార్కెట్‌లో రద్దీ
- తొమ్మిది రోజుల మాలలు స్వీకరించనున్న భక్తులు

ఖమ్మం ఖానాపురం హవేలి / కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : 'ఓం గం గణపతియే నమః.. ఓం మంగళపతియే నమః' అంటూ ఆ ఆదిదేవుడు గణేషుడు పూజలందుకోనున్నాడు. బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సర్వం సిద్ధమైంది. ఉండ్రాలయ్యకు దండాలు పెడుతూ నిత్య పూజలు చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఊరూవాడా.. మండపాలలో ఆ దేవదేవుడిని ప్రతిష్ఠింపజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో సుమారు 10వేల విగ్రహాల వరకు ప్రతిష్ఠించనున్నట్టు అంచనా. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ పాల్గొనే ఉత్సవాల్లో పూజల అనంతరం రాత్రుళ్లు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఖమ్మం నగరంలో పలు ప్రాంతాలలో 3 అడుగు నుంచి 35 అడుగుల వరకు గణనాథులు ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని గాంధీచౌక్ గణేష్ ఆలయంలో నవరాత్రులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. పలు చోట్ల భారీ సెట్టింగులతో మండపాలను ముస్తాబు చేశారు. ఇక ఈ తొమ్మిది రోజుల పాటు పలువురు భక్తులు గణేష్ మాలలు ధరించనున్నారు. పూజకు అవసరమైన పత్రి, సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన జనంతో మంగళవారం సాయంత్రం నగరంలోని ఇల్లెందు రోడ్, సర్దార్‌పటేల్ స్టేడియం, పెవిలియన్ గ్రౌండ్‌తో పాటు పలు ప్రాంతాలు రద్దీగా మారాయి. ఈ ఏడాది వీటి ధరలు అధికంగా ఉన్నాయని భక్తులు చెబుతున్నారు. మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ చవితి సందడి మొదలైంది. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు తదితర పట్టణాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ గణపయ్య కొలువు దీరేందుకు మండపాలు సిద్ధమయ్యాయి.

● ఖమ్మం పెవిలియన్‌గ్రౌండ్ వద్ద పూజాసామగ్రి, మట్టి వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న జనం







చవితి సందడి..
చినుకు సవ్వడి

- ఉమ్మడి జిల్లాలో ముసురు
- వినాయక నవరాత్రుల ఏర్పాటుకు కొంత అంతరాయం



పరవళ్లు తొక్కుతున్న తాలిపేరు నీరు

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి) / చర్ల, ఆగస్టు 26 : వినాయక చవితి సందడి వేళ.. వాన చినుకుల సవ్వడి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి ముసురు వర్షం పడుతోంది. వారం రోజులుగా తెరపిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా

(మిగతా 6వ పేజీలో)

ఆచార, సంప్రదాయాలకు
పెద్దపీట


- రామాలయ అభివృద్ధి, భక్తుల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం
- నూతన ఈవో దామోదర్‌రావు

భద్రాద్రి దేవస్థానం ఈవోగా దామోదర్‌రావు

ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి

భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ కె.దామోదర్‌రావును నియమించారు. ఈ మేరకు జీవో నెం.340ను రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఇటీవల వరకు భద్రాచలం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహి ంచిన దామోదర్‌రావును ప్రభుత్వం ఇటీవల దేవాదాయశాఖకు కేటాయించగా.. ఆయన ఈ నెల ఆయన భద్రాచలం ఆర్డీవోగా రిలీవ్ అయి దేవాదాయ శాఖలో రిపోర్టు (మిగతా 6వ పేజీలో)

భద్రాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి)





దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం రామాలయం అభివృద్ధితో పాటు భక్తుల మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవోగా నియమితులైన కె.దామోదర్‌రావు అన్నారు. మంగళవారం భద్రాచలం దేవస్థానం ఈవోగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయిన అనంతరం ఆయనతో 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి' ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన ఈవోగా నియమితులైన దామోదర్‌రావు తాను త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

రామాలయ అభివృద్ధి.. భక్తులకు మౌలిక సదుపాయాలపై దృష్టి..

రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధికి చర్యలు చే పడుతుండడంతో.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అభి వృద్ధి పనులు చురుగ్గా సాగేందుకు చర్యలు తీసుకుంటా. ఇప్పటి వరకు భద్రాచలం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించడంతో రామాలయ అభివృద్ధికి భూ సేకరణ సైతం నా ఆధ్వర్యంలోనే చేపట్టాం. నిర్వాసితులతో సైతం ఎటువంటి సమస్య లేకుండా భూమిని సేకరించడం జరిగింది. అదేవిధంగా భద్రాద్రి రామయ్యను దర్శించేందుకు తరలివచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రాధాన్యమిస్తా. వివిధ విభాగాల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న డిజిటలైజేషన్ విధానాన్ని పారదర్శకత కోసం మున్ముందు రోజుల్లోనూ కొనసాగిస్తా.

ఆధ్యాత్మిక భావన మరింతగా వెల్లివిరిసేందుకు కృషి

చారిత్రకపరంగా ఎంతో ప్రసిద్ధి పొందిన భద్రాద్రి రామాలయంలో ఆధ్యాత్మిక భావన భక్తులకు మరింత గా వెల్లివిరిసేలా చేస్తా. రామాలయంలో మూడున్నర శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచార సంప్రదాయాలు వైదిక సిబ్బంది సహకారంతో కొనసాగేందుకు కృషి చే స్తా. రామయ్యను దర్శించేందుకు వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం సంతృప్తికరంగా జరిగేలా, వారితో మర్యాద పూర్వకంగా విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది మెలిగేలా చూస్తాం. అదేవిధంగా రామయ్యకు వివిధ రూపాల్లో విరాళాలు అందజేసే దాతలకు సముచిత ప్రాధాన్యమిచ్చి గౌరవిస్తాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న భద్రాద్రి రామయ్య భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

లింగ నిర్ధారణ చేస్తే
కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి
- ఖమ్మంలో జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశం

6

బాబోయ్
కుక్కలు

- పినపాక, మోటమర్రిలో చిన్నారులపై దాడి.. తీవ్రగాయాలు

నవరాత్రి ఉత్సవాలకు
పటిష్ఠ బందోబస్తు

- విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి
- నేర సమీక్షలో ఖమ్మం పోలీసు కమిషనర్

7

యూరియా వెతలు

- అర్ధరాత్రి నుంచే అన్నదాతల పడిగాపులు



కారేపల్లిలో..

పంచాయతీ ఓటర్ల జాబితా సిద్ధం

- రేపు పంచాయతీల్లో ముసాయిదా జాబితా ప్రదర్శన
- నోటిఫికేషన్‌ను విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్



ఓటర్ల జాబితా ప్రతులను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత (ఫైల్)

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. పంచాయతీల వారీగా ఓటర్ల వివరాలను సిద్ధం చేసిన అధికారులు గురువారం అన్ని పంచాయతీల్లో ముసాయిదా జాబితాను, పోలింగ్ కేంద్రాలను ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కమిషనర్ నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గ్రామం యూనిట్‌గా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. దీంతో పాటు జిల్లాలో 5,214 పోలింగ్ కేంద్రాల జాబితాను కూడా అన్ని గ్రామపంచాయతీల్లో ప్రదర్శనకు పెట్టనున్నారు. గురువారం అన్ని పంచాయతీ, మండలపరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శనకు పెడతారు. 29న జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహిస్తారు. 30న ఎంపీడీవోల ద్వారా మండలస్థాయిలో సమావేశాన్ని నిర్వహిస్తారు. 30న ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి 31న జిల్లా పంచాయతీ అధికారి సమక్షంలో వాటిని పరిష్కరిస్తారు. ఆగస్టు 2న తుది జాబితాను ప్రకటించ నున్నారు.

గతంలో పంచాయతీల్లో ఉన్న గ్రామాలు నేడు ప్రత్యేక పంచాయతీలుగా కొన్ని, మరికొన్ని మునిసిపాలిటీల్లో విలీనమయ్యాయి. పంచాయతీల వారీగా ఓటర్లను పోర్టల్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత రెండో దశలో పంచాయతీలకు వచ్చిన ఓటర్లతో వార్డుల వారీగా విభజించి ఒక కుటుంబ సభ్యుల ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కొత్త జాబితాలో మృతుల పేర్లు తొలగించడం, కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నవారి పేర్లను చేర్చి తాజాగా సిద్ధం చేశారు.

5,214 పోలింగ్ కేంద్రాలు

గతంలో 579 పంచాయతీలు ఉండగా తాజాగా 571 పంచాయతీలుగా తేల్చారు. మొత్తం 5,214 వార్డు స్థానాలుగా మార్పులు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 579 పంచాయతీలుండేవి. అందులో కల్లూరు మునిపిసల్‌గా మారడంతో నాలుగు పంచాయతీలు అందులోకి వెళ్లాయి. 35 వార్డులు కూడా పురపాలికలో విలీనమయ్యాయి. పోలింగ్ కేంద్రాల సంఖ్య గతంలో 5,214గా లెక్కతేల్చారు.

మార్కెట్ అక్రమార్కులపై..
చర్యలేవీ?

- ఫీజు ఎగ్గొట్టిన వ్యాపారులు మళ్లీ దర్జాగా వ్యాపారం
- ఇటీవల దొంగబిల్లుతో దొరికిన వ్యక్తిపై అధికారుల ఉదాసీనత!
- వ్యాపారం చేయకుండా ఐడీ బ్లాక్.. ఆ వెంటనే అన్‌బ్లాక్
- ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వక పోవడంపై అనుమానాలు



ఖమ్మం మార్కెట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్ ఫీజు చెల్లించకపోయినా, నిబంధనలు పాటించకపోయినా.. తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో దర్జాగా వ్యవహరిస్తున్నారు. అలాంటి వ్యాపారులకు మార్కెట్ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని వ్యాపార వర్గాలు బహిరంగంగానే పేర్కొంటున్నాయి. ఒక వైపు రైతుల పంటకు ధరలు తగ్గించి వారిని నష్టపరుస్తూ, మరో వైపు మార్కెట్ అధికారులను రాజకీయ ఒత్తిడితో తప్పుదోవ పట్టిస్తూ పబ్బం గడుపుతున్నారు. మార్కెట్‌లో గత నాలుగైదు సంవత్సరాల నుంచి వ్యాపారులు వారు చేసిన వ్యాపారంపై మార్కెట్‌కు చెల్లించాల్సిన ఒక శాతం మార్కెట్ ఫీజు రికవరీకి సంబంధించి మార్కెట్ అధికారులు అసలు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తాజాగా ఖమ్మం మార్కెట్‌లో పత్తి వ్యాపారం చేసే ఒక వ్యాపారి మరో వ్యాపారికి చెందిన బిల్లు(సెస్) పుస్తకాలపై దొంగ వ్యాపారం చేస్తూ అడ్డంగా దొరకడంతో విషయం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కాగా సదరు ట్రేడింగ్ కంపెనీపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తుండటంతో పాటు ఆ సంస్థ ఐడీని సోమవారం ఉదయం తూతూ మంత్రంగా బ్లాక్‌లో పెట్టి ఆ వెంటనే సాయంత్రం అన్‌బ్లాక్ చేసి మళ్లీ వ్యాపార అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు

(మిగతా 8వ పేజీలో)

నిబంధనల మేరకు నడుచుకుంటాం

యరగర్ల హన్మంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్



మార్కెట్‌లో వ్యాపారం మార్కెట్ బైలా ప్రకారమే చేయాలి. ఏ వ్యాపారి ఎలాంటి తప్పు చేసినా వదిలే ప్రసక్తి లేదు. నియమనిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. రూల్ ఈజ్ రూల్ అందులో ఎలాంటి సందేహం లేదు. రైతులకు, మార్కెట్ వ్యవస్థకు నష్టం చేకూరేలా వ్యవహరించిన వారికి ఇబ్బందులు తప్పవు.



లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

» ఖమ్మం డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. కళావతిబాయి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పరిధి జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలలో జరిగే ప్రతి స్కానింగ్‌కు సంబంధించి ఫారం ఎఫ్ రూపొందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 988 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ. పది వేలు జరిమానా విధించబడుతుందన్నారు. లింగ నిర్ధారణ అరికట్టేందుకు ప్రతి నెల స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆసుపత్రులలో జరుగుతున్న అబార్షన్ కేసులను సైతం స్టడీ చేసి ఎక్కడైనా లింగ నిర్ధారణ కారణంగా అబార్షన్ జరిగిందా అని పరిశీలించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. అబార్షన్లు అధికంగా జరిగే ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ చేయకుండా ఉండే విధంగా చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. లింగ నిష్పత్తి సమానమయ్యే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా సంక్షేమశాఖ ద్వారా ప్రజల్లో ఆడపిల్ల అదృష్టమనే అవగాహనతో ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. పోస్టర్లు, కరపత్రాల ద్వారా చట్టంపై అవగాహన, ఆడపిల్లలు మగపిల్లలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గర్భిణీలపై అంగన్వాడీ, ఆశాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, పీవో ఎంసీహెచ్ డాక్టర్. చందునాయక్, పీవో ఎన్సీవీ డాక్టర్ పి. వెంకట రమణ,ఏడీ శ్రీనివాసరావు, డీఎంసీ ఎస్డీ. సమీన్, జాగృతి ఎన్జీఓ ఎం. కుముదిని తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

బాబోయ్ కుక్కలు

» పినపాక, మోటమర్రిలో చిన్నారులపై దాడి.. తీవ్రగాయాలు

పినపాక, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో వీధి కుక్కల స్వైర విహారంతో జనం బెంబెలెత్తుతున్నారు. గత రెండురోజుల వ్యవధిలోనే నలుగురిని కరవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తాజాగా వెంకట్రావుపేట గ్రామంలో ఏడాది వయస్సున్న బాబు సౌందపు ఈశాన్విక్‌ను తల్లి ఇంటి వరండాలో వదలడంతో ఆడుకుంటుండంగా, పిచ్చికుక్క కరవడంతో తీవ్రగాయాలయ్యాయి. బాబు తల్లిదండ్రులు సౌందపు సంతోష్, వెన్నెల హుటాహుటిన మణుగూరు ఆసుపత్రికి, అక్కడి నుంచి భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. గత రెండు రోజుల వ్యవధిలో వెంకట్రావుపేట, చింతలబయ్యారం, ఏడూళ్లబయ్యారం గ్రామాల్లోని ఆరుగురు వ్యక్తులను రెండు గేదేలను కుక్కలు కరిచినట్లు స్థానికులు చెబుతున్నారు. పినపాకలో గత రెండు రోజుల్లో ఏడూళ్లబయ్యారం గ్రామంలో కాకర్ల వెంకటమ్మ, కె. హన్షిక, దాసరి నాగలక్ష్మిలు కుక్కకాటుకు గురికాగా, వెంకట్రావుపేటలో మాటూరి సాత్విక్, కప్ప రాజులతో పాటు, సోమవారం ఏడాది బాబు ఈశాన్విక్‌లు కుక్కకాటుకు గురయ్యారు. వెంకట్రావుపేట, చింతలబయ్యారం గ్రామాల్లో రెండు గేదెలను కరిచినట్లు స్థానికులు చెబుతున్నారు. కుక్కకాటుకు గురైన వారికి



పినపాక ప్రభుత్వాసుపత్రిలో రెబీస్ వ్యాక్సిన్‌అందించినట్లు పినపాక వైద్యురాలు దుర్గాభవాని తెలిపారు. ప్రజల ప్రాణాలను బలిగొంటున్న కుక్కలను నిర్మూలించేందుకు గ్రామ పంచాయతీ అధికారులు తగు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బోనకల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి గ్రామంలో సోమవారం నాలుగేళ్ల చరిష్మా ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా వీది కుక్క మీద పడి కరవడంతో తీవ్రంగా గాయపడింది. సమయానికి తల్లిదండ్రులు బయటకు రావడంతో బాలికకు ప్రాణాపాయం తప్పింది. గ్రామాల్లో కుక్కల బారీన విద్యార్థులు పడకుండా కాపాడటానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రాద్రి దేవస్థానం ఈవోగా దామోదర్‌రావు

(5వ పేజీ తరువాయి)

చేశారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామానికి చెందిన కె.దామోదర్‌రావు 2007లో గ్రూప్-2కు ఎంపికై మహబూబ్‌నగర్ డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2011లో నల్లగొండ, చుండూరు, చిలు కూరు, మేళ్లచెర్వు మండలాలకు తహసీల్దారుగా విధులు నిర్వహించారు. ఈ క్రమంలో 2023 ఆగస్టులో డిప్యూటీ కలెక్టరుగా ఉద్యోగోన్నతి పొంది చుండూరులో ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించారు. 2024 జరిగిన పార్లమెంటు ఎన్నికల సమయంలో భద్రాచలం ఆర్డీవోగా వచ్చారు. అయితే ఇటీవల భద్రాచలం సబ్‌కలెక్టరుగా మృణాల్ శ్రేష్టను నియమించిన క్రమంలో ఆయన ఆగస్టు 4న ఆర్డీవో బాధ్యతల నుంచి రిలీవ్ అయి దేవాదాయశాఖలో రిపోర్టు చేయగా.. తాజాగా భద్రాద్రి దేవస్థానం ఈవోగా నియమితులయ్యారు. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

సత్తా ఉన్నా.. కలిసిరాని ఆర్థిక స్థితి

» ప్రపంచ స్కేటింగ్ పోటీలకు వెళ్లలేని దైన్యం » సాయం కోసం నయనశ్రీ ఎదురుచూపు



బోనకల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన తాళ్లూరి నయనశ్రీ ఐస్ స్కేటింగ్‌లో పతకాల మోత మోగిస్తుంది. తాళ్లూరి నారాయణరావు, వీణ దంపతుల ఏకైక కుమార్తె నయనశ్రీ. చిన్నపాటి ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ బెంగుళూరులో ఉంటున్నారు. బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న నయనశ్రీ చిన్న వయస్సు నుంచే స్కేటిం గ్ పట్ల ఆసక్తి చూపడంతో పాటు, క్రీడా ప్రావీణ్యం చాటి ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో 17 పతకాలు సాధించింది. ఈ నెల 20 నుంచి 23 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన ఏషియన్ ఓపెన్ షార్ట్ ట్రాక్ స్పీడ్ ఐస్ స్కేటింగ్ పోటీల్లో నయనశ్రీ రెండు రజితం, రెండు కాంస్య పతకాలను సాధించింది. 11 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. 500 మీటర్ల విభాగంలో కాంస్యం, 1500 మీటర్లల్లోనూ కాంస్యం, 1000 మీటర్లల్లో రజతం, మహిళల రిలే విభాగంలో రజత పతకాలను సాధించింది. రెండు నెలల క్రితం డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలల్లో 500, 1000, 1500 మీటర్ల పోటీలల్లో మూడు బంగారు పతకాలను సాధించింది.

జూనియర్ వరల్డ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక

ఈ ఏడాది నవంబర్ నెలలో కజకిస్తాన్‌లో జరగనున్న జూనియర్ వరల్డ్ చాంపియన్ షిప్ ఐస్ స్కేటింగ్ పోటీలకు నయనశ్రీ ఎంపికైంది. దాదాపు 30 దేశాల క్రీడాకారులు పోటీలల్లో పాల్గొనున్నారు. ఐస్ స్కేటింగ్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ కోసం సౌత్ కొరియా వెళ్ల వలసి ఉంటుంది. రెండు నెలల పాటు అక్కడ తీసుకునే ప్రత్యేక శిక్షణతో పాటు పోటీలకు వెళ్లేందుకు దాదాపు రూ.పది లక్షల వరకు ఖర్చు వస్తుంది. తల్లిదండ్రులు చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ స్కేటింగ్ పట్ల మక్కువ చూపుతున్న కుమార్తెను ఇప్పటి వరకు ఆర్థిక కష్టాలను భరిస్తూనే నెట్టుకొచ్చారు. వరల్డ్ చాంపీయన్ షీప్ పోటీలల్లో మన దేశం తరపున ఆడనున్న మొట్ట మొదటి క్రీడాకారిణి కావడంతో ఆమెకు ఆర్థికంగా సహకారం అందిస్తే దేశంతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తుందన్న ఆశాభావాన్ని క్రీడాభిమానులు వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి ఫొటోగ్రఫీలో తరుణ్‌కుమార్ ప్రతిభ



తల్లాడ, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికిచెందిన ఫొటోగ్రాఫర్ కోడూరు తరుణ్‌కుమార్ ప్రతిభను చాటి ప్రథమస్థానంలో నిలిచాడు.. వనపర్తిలో నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈఫలితాల్లో తరుణ్‌కుమార్‌ను ప్రథమ బహుమతివరించింది. ఈసందర్భంగా తరుణ్‌కుమార్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

టీఎల్ఎంతో విద్యార్థులకు ఉపయోగం

ఖమ్మం రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బోధనాంతరం విద్యార్థుల అభ్యసన ఫలితాలు సాధించడానికి టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) దోహదపడుతుందని జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి విజయలక్ష్మీ అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని గొల్లగూడెం పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన బోధనాభ్యాసన సామగ్రి మేళా కార్యక్రమానికి మంగళవారం ఆమె హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు విద్యార్థులకు పాఠాన్ని సులభతరం చేసేదే టీఎల్ఎం అని తెలిపారు. ఉద్దీపకం వర్క్ బుక్-1పై ఒకటి, రెండు తరగతులకు సంబంధించి తెలుగు విషయంలో 3, 4, 5 తరగతులకు ఆంగ్లం, గణితం విషయంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, విజేతలను త్వరలో భద్రాద్రి జిల్లాలో జరిగే పోటీలకు పంపనున్నట్లు ఏటీడీవో సత్యవతి తెలిపారు. ప్రథమ స్థానం జీపీఎస్ నానునగర్ తండా, ద్వితీయ స్థానం జీపీఎస్ గోవింద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ భారతి, ఏసీఎంఓ రాములు, ఎస్‌సీఆర్‌పీ బాలా, పాఠశాల హెచ్ఎం శ్యామ్ ప్రసాద్, పీజీ హెచ్‌లు ధర్మ, హెచ్‌డబ్ల్యూఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న సినీహీరో హర్షరోషన్

దుమ్ముగూడెం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని కోర్టు సినిమా హీరో హర్షరోషన్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీ హీరోతో కలిసి పలువురు స్థానికులు ఫొటోలు దిగారు. గుండపనేని వెంకటేశ్వరావు, దల్లి వేణు, కర్రి రవీంద్ర, అశోక్, గణేష్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న సినీ హీరో హర్షరోషన్

దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆలింకో ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన దివ్యాంగ ఉపకరణాల గుర్తింపు శిబిరం విజయవంతమైందని విద్యాశాఖ సీఎంవో బాజోజు ప్రవీణ్‌కుమార్ అన్నారు. 18 ఏళ్ల లోపు దివ్యాంగ చిన్నారులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీ చేయనున్నారని అన్నారు. జిల్లాలోని 9 మండలాలకు చెందిన 240 మంది దివ్యాంగులు హాజరయ్యారని తెలిపారు. మిగిలిన మండలాలకు ఈ నెల 28, 29 తేదీలలో వీఎం బంజర, వైరాలలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో జగదీష్, ఎంఈవో శైలజ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతికేసులో ముగ్గురి అరెస్ట్

» మరొకరు పరారీలో.. గాలింపునకు ప్రత్యేక బృందం ఏర్పాటు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన వివాహిత అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు అరెస్టు వివరాలు వెల్లడించారు. అశ్వారావుపేటకు చెందిన పూల లక్ష్మీప్రసన్న అనే మహిళ మూడురోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. తమ కుమార్తెను అల్లుడు నరేశ్, అతడి అక్క భూలక్ష్మీ, బావ దాసరి శ్రీనివాసరావు, తల్లి విజయ హింసించి చంపారంటూ లక్ష్మీ ప్రసన్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తు అనంతరం మృతురాలి భర్త పూల నరేశ్, అక్క భూలక్ష్మీ, తల్లి విజయను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. మరొక నిందితుడు శ్రీనివాసరావు పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలిస్తున్నామని తెలిపారు. త్వరలోనే శ్రీనివాసరావును అరెస్ట్ చేసి దర్యాప్తును వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ యాయాతిరాజు, రామ్మూర్తి, అఖిల, ఇతర సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐలు

29న మణుగూరు ఐటీఐలో జాబ్ మేళ

మణుగూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మణుగూరు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళాను 29న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీ రవి మంగళవారం తెలిపారు. మణుగూరు ఏరియాలోని ఎస్ఎంఎస్ కంపెనీలో టెక్నిషియన్, ఆపరేటర్స్ ట్రైనింగ్ ఉద్యోగాల కోసం ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ ప్రతినిధులు నేరుగా అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. ఐటిఐ పూర్తి చేసిన ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, సర్వేయర్, డిజిల్ మెకానిక్ మోటార్ మెకానిక్ కోర్సులు పూర్తి చేసిన వారు ఈ మేళాకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 21 లోపు మాత్రమే అర్హులన్నారు. 29వ తేది ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావాలని సూచించారు.

చవితి సందడి.. చినుకు సవ్వడి

(5వ పేజీ తరువాయి)

చల్లబడింది. వినాయకచవితి నేపథ్యంలో కురుస్తున్న ఈవర్షం వినాయక విగ్రహాలు కొనుగోలు దారులకు, అమ్మేవారికి కొంత ఇబ్బంది. మండపాల్లో విగ్రహాలు తడవకుండా వాటర్‌ప్రూఫ్ మండపాలు ఏర్పాటు చేశారు. అలాగే పత్రి అమ్మకం దారులు కూడా కొంత ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రి కొంత తెరిపినివ్వడంతో నగర వాసులు పత్రి, ఇతరత్రా సామగ్రి కొనుగోళ్లకు రోడ్లపైకి రావడంతో సందడి వాతావరణం కనిపించింది. ఈ వర్షంతో పత్తి, వరి, మొక్కజొన్న, కంది, పెసర తదితర పంటలకు లాభం కలగనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా మణుగూరులో 2.83సెంమీ వర్షపాతం నమోదైంది. దుమ్ముగూడెంలో 2.43, అశ్వాపురంలో 2.05, టేకులపల్లిలో 1.7, సుజాతనగర్, పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం, ఆళ్లపల్లిలో 1.68, పాల్వంచ మండలం సీతారామపట్నంలో 1.65, లక్ష్మీదేవిపల్లిలో 1.63, బూర్గంపాడు, కరకగూడెంలో 1.5, ఇల్లెందులో 1.43, చంద్రుగొండ మండలం మద్దుకూరులో 1.38, ములకలపల్లిలో 1.23, గుండాలలో 1.15, దమ్మపేట మండలం అంకంపాలెంలో 1.08, కొత్తగూడెంలో 1.03, అన్నపురెడ్డిపల్లి పెంట్లంలో 1 సెంమీ వర్షపాతం నమోదైంది.

తాలిపేరుకు వరద పోటు.. 12 గేట్లు ఎత్తివేత

భద్రాద్రి జిల్లా చర్ల మండలంతో పాటు సరిహద్దునున్న ఛత్తీస్‌గడ్ కురుస్తున్న భారీ వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అప్రమత్త మైన అధికారులు మంగళవారం ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తి 92,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే మండలంలో రోటింత వాగు, జెర్రిపోతుల, తరి వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఇక ఛత్తీస్‌గడ్ కూడా భారీగా వర్షాలు పడుతుండగా.. బీజాపూర్, సుకుమా జిల్లాలో వాగులు పడి రాకపోకలు నిలిచి పోయాయి. భారీగా వస్తున్న వరదతో ప్రాజెక్టు నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. వరదనీటిని అంచనా వేస్తున్న అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 72.96 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో 55 వేల క్యూసెక్కులుగా ఉంది. భారీ వర్షాలకు బుధవారం, గురువారం కూడా ప్రాజెక్టుకి వరదనీరు పెరిగే అవకాశం ఉందని డీఈ తిరుపతి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

భద్రాచలం చేరుకున్న విద్యార్థి పోరుబాట యాత్ర

భద్రాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి పోరుబాట యాత్ర మంగళవారం భద్రాచలం చేరుకుంది. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ తెలంగాణలో పాలకులు మారినా ప్రభుత్వ విద్యాభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న భద్రాచలం జూనియర్ కళాశాలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నేత మునిగల శివ ప్రశాంత్, రామ్‌చరణ్, అబ్దుల్ గని, శ్రావణి, సంధ్య, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాలపై దశలవారీ పోరాటం

» సెప్టెంబరు నుంచి ఆందోళనలకు ప్రణాళిక

» ఐజేయూ నగర కమిటీ సమావేశంలో రాంనారాయణ

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్లస్థలాలతో పాటు ఇన్సూరెన్సు, ఇతర సంక్షేమ పథకాల సాధనకోసం వచ్చేనెల నుంచి దశలవారీ పోరాటానికి సిద్ధం కావాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం జడ్పీ సమావేశ మందిరంలో సంఘం నగర అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కల నెరవేరక పోవడంతో పాటు అనేక సమస్యలతో సతమతమవతున్నారని, సంక్షేమ కార్యక్రమాల విషయంలో నాయకులు, ప్రభుత్వాలు అనేక ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది నాయకులు, అధికారులకు వినతులు అందించామని.. అయినప్పటికీ స్పందన లేదన్నారు. ఇకపై జర్నలిస్టులంతా సంఘటితమై పోరాటానికి సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ప్రమాదబీమా పథకాలు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం తదితర హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. కనీసం అక్రిడెటేషన్లు మంజూరుచేయలేని పరిస్థితి ఉందన్నారు. ఐజేయూ జాతీయ కమిటీ సభ్యులు నలజాల వెంకటరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.వేణుగోపాల్, సామినేని మురారి, నర్వనేని వెంకటరావు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, షైసా పాపారావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మామిడాలభూపాల్, మహేందర్, స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖమ్మంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో వేసిన మొక్కలు తొలిగించాలని, అలాగే ఇండ్లస్థలాలు సాధించే వరకు ఐక్య పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈసమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు శివ, నగర నాయకులు జనార్ధనచారి, ఏలూరి వేణుగోపాల్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నామా పురుషోత్తం, శ్రీనివాసరావు, కళ్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ

గిరిజనుల అభ్యున్నతకి కృషిచేయాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ » పీవో, అదనపు కలెక్టర్, అధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ఏరియాలోని మారుమూల అడవి ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు పీఎం ధర్తీ అబాజాన్ జాతీయ గౌరవ ఉత్కర్ష అభియాన్ పథకంలో భాగంగా వారిని చైతన్యపరిచి గిరిజనులకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీఓసీలోని సమావేశమందిరంలో ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వివిధ జిల్లా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పథకం విజయవంతం చేయాలని పలు సూచనలు చేశారు. ఏజెన్సీ పరిధిలో 19మండలాల్లో 134 గ్రామాల్లో ఈ పథకం పకడ్బందిగా అమలు చేయడానికి హైదరాబాద్ నిమ్స్‌మిక్‌లో అధికారులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, రూరల్ డెవలప్‌మెంట్, ఐసీడీఎస్, ఫారెస్టు, జల్‌జీవన్ మిషన్, గిరిజన సంక్షేమశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వార గ్రామాల్లో చేపట్ట వలసిన మౌలిక వసతులపై లబ్దిపొందేలా సంబంధిత శాఖాధికారులు పనిచేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సహాయ ప్రాజెక్టు అధికారి డెవిడ్‌రాజ్, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మీ, డీఈఓ నాగలక్ష్మీ, డీడబ్ల్యూవో లెనీనా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హరిలాల్ పాల్గొన్నారు.

ఎస్సీ అభివృద్ధి అధికారిగా శ్రీలత బాధ్యతలు

చుంచుపల్లి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారిగా ఏ.శ్రీలత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్ప టి వరకు ఏఎస్‌డబ్ల్యూఓగా హనుమకొండ జిల్లాలో హసన్‌పర్తిలో విధు లు నిర్వహిస్తూ ఉద్యోగన్నతిపై భద్రాద్రి జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ జిల్లా షెడ్యూల్ కులముల అధికారిగా కొనసాగిన డి.అనసూర్య ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పూర్తి బాధ్యతలు కొనసాగించనున్నారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు గురుకుల విద్యార్థి

కూసుమంచి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు కూసుమంచి బీ సీ గురుకుల విద్యార్థి నాగరాజు ఎంపికయ్యా డు. ఇటీవల ఖమ్మంనగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు జరిగాయి. అండర్ -16 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలోనూ, లాంగ్‌జంప్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో నాగరాజును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 30నుంచి రెండురోజులపాటు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, ఆర్‌సీవో రాంబాబు, పీఈటీ నర్సింహ అధ్యాపకులు నాగరాజును అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఆర్సీవో, ప్రిన్సిపాల్, పీఈటీ

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

పాల్వంచ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు భరించలేక ఉరివేసుకొని మహిళ ఆతహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం జెట్టి దీపిక (35) స్థానిక సీ కాలనీలో నివాసముంటుంది. ఆమె భర్త సుధాకర్ కేటీపీఎస్‌లో 7వ దశలో ఏడీఈగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఆమె ఆరోగ్య పరంగా పలు సమస్యలను ఎదుర్కొంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను కేటీపీఎస్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందిందని నిర్ధారించారు. దీంతో వారు పాల్వంచ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేయనున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

పోలీసుపై దాడికేసులో ఆరు నెలల జైలు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌పై దాడి చేసిన కేసులో సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జీ వీ.లావణ్య ముద్దాయికి మంగళవారం ఆరునెలలు జైలుశిక్ష విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా చాట్రాయి మండలానికి చెందిన తిరువీధుల సురేంద్ర పలుప్రాంతాల్లో దొంగతనాలు చేస్తూ జైలుకు వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలో సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కానిస్టేబుల్ నరేష్‌కు తారసపడటంతో పట్టుకునేందుకు వెంబడించగా శివారులోని మెట్టాంజనేయ స్వామి ఆలయం సమీపంలో పట్టుబడ్డాడు. విడిపించుకునే పారిపోయే క్రమంలో నరేష్‌పై కత్తితో సురేంద్ర దాడిచేయగా ఎట్టకేలకు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. దర్యాప్తులో గతంలో చేసిన చోరీలు రుజువు కావడంతో పాటు దాడిచేసిన కేసులో ముద్దాయి సురేంద్రకు పైవిధంగా శిక్ష విధిస్తూ సత్తుపల్లి కోర్టు తీర్పునిచ్చింది.

మట్టి గణపతే మహా గణపతి


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆంధ్రజ్యోతి భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ రమేష్, రిపోర్టర్లు, రోటరీక్లబ్ బాధ్యులు


వినాయకపురంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ
కొత్తగూడెం, అశ్వారావుపేటల్లో కార్యక్రమాలు.. ప్రజల నుంచి విశేష స్పందన

కొత్తగూడెం సాంస్కృతికం / అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్ష ధ్యేయంగా.. మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని కోరుతూ ప్రతీ ఏడాది వినాయక చవితి సందర్భంగా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం, అశ్వారావుపేటల్లో దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెంలోని ఎంజీ రోడ్‌లో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, రోటరీక్లబ్ ఆఫ్ కొత్తగూడెం సంయుక్త ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. 'ఆంధ్రజ్యోతి' భద్రాద్రికొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ తాళ్లూరి రమేష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జక్కుల రవికుమార్ భక్తులకు వినాయక ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి కొత్తగూడెం విలేకరులు జోగం తారక్, కల్లోజి శ్రీనువాస్, గుణ సురేష్, చలపతి రాజు, పూర్ణ చందర్‌రావు, యాడ్ ఆఫీసర్ కోట రాజు, రోటరీక్లబ్ కొత్తగూడెం కార్యదర్శి శ్రీరామనేని చలపతి రావు, సభ్యులు నయ్యింపాష, ఉండేటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట మండలంలోని తిరుమలకుంట, వినాయకపురం, అశ్వారావుపేటలో మంగళవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో శ్రీవెంకట సత్యసాయి ఫిల్లింగ్ స్టేషన్, ఆర్యవైశ్య సంఘం, లేపాక్షి ఐరన్ షాపు సహకారంతో వినాయక మట్టి విగ్రహాల పంపిణీ జరిగింది. తిరుమలకుంట, వినాయకపురం, భద్రాచలం రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాల పంపిణీని సీఐ నాగరాజు ప్రారంభించారు. గణపతి నవరాత్రులను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణే ధ్యేంగా ఏటా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అందరికీ ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' ఆర్‌సీ ఇన్‌చార్జ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శీమకుర్తి శ్రీనివాసరావు, రిపోర్టర్లు లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, శీమకూర్తి రవి, ఆర్యవైశ్య సంఘం నాయకులు లోకనాథ్ గుప్త, గ్రామపెద్దలు ఉప్పల ప్రసాద్, బిర్రం వెంకటేశ్వరరావు, తోకల సత్యనారాయణ, ఉప్పల మురళీ, రామలక్ష్మయ్య, బొడ్డు సత్తిబాబు, సాధు నాగేశ్వరావు, పెద్ద సత్యనారాయణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అప్పారావు, శీమకుర్తి జితేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

సమీక్ష సమావేశంలో ఖమ్మం పోలీసుకమిషనర్


సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం ఆగస్టు26(ఆంధ్రజ్యోతి) : నవరాత్రుల సందర్భంగా ప్రజాభద్రతతో పాటు ప్రశాంత వాతావరణంకు భంగం కలగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసి అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. పోలీసు కాన్ఫరెన్స హాల్‌లో మంగళవారం జరిగిన నేరసమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలు, నిమజ్జన వరకు చిన్న పొరపాటుకు తావులేకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. అత్యవసర పరిస్తితుల్లో వెంటనే స్పందించడానికి సన్నద్ధమై ఉండాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రాత్రివేళల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి, మహిళల, పిల్లలపై జరిగిన నేరాలు, వ్యవస్థీకృత నేర ముఠాలు, మాదక ద్రవ్యాల సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈసమావేశంలో ఏడీసీపీ ప్రసాదరావు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహేమాన్, రఘు, సాంబరాజు, మహేష్, సర్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'అగ్ని వీర్' భారత వైమానిక దళంలో ఉద్యోగ దరఖాస్తులకు ఆహ్వానం

భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్

చుంచుపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):అగ్నివీర్ వాయుభారత వైమానిక దళంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతను వైమానిక దళంలో క్లారికల్ లేదా టెక్నికల్ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అవివాహిత మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థి ఇంటర్మీడియట్ పాసై మూడు సంవత్సరాల డిప్లమా ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసి ఉండాలని, ఎత్తు 152 సెంటీ మీటర్లు, వయస్సు 17 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఆసక్తి గల యువత అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు భద్రాద్రి జిల్లా ఐడీవోసీలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కేటీపీఎస్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్


కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని సొసైటీ కార్యాలయం

పాల్వంచ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని కేటీపీఎస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నిర్వహణ సమితి సభ్యుల ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర కో ఆపరేటీవ్ ఎలక్షన్ అథారిటీ సోమవారం విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణ అధికారిగా జిల్లా కో ఆపరేటీవ్ అధికారి వ్యవహరించనున్నారు. సొసైటీలో 13 పోస్టులకు జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ ఈ నెల 30న జరిగే నామినేషన్ల ప్రక్రియతో ప్రారంభమవుతుంది. ఆగస్టు 30, సెప్టెంబరు 2 తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పాల్వంచ కో ఆపరేటీవ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నారు. సెప్టెంబరు 3న నామినేషన్ల పరిశీలన చేపట్టి వెంటనే అర్హత కలిగిన అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాను ప్రకటిస్తారు. 4వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించి తుది జాబాతాతో పాటు గుర్తులను కేటాయిస్తారు. 10వ తేదీన పాల్వంచలోని డీఏవీ పాఠశాల, మణుగూరులోని ఎస్‌పీఎఫ్ బిల్డింగ్, దామరచర్లలోని స్టోర్ ఆఫీస్‌ల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మణుగూరు, దామరచర్ల పోలింగ్ స్టేషన్ల నుంచి బ్యాలెట్ పత్రాలు వచ్చిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి ఫలితాలను ప్రకిటిస్తారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో అండర్-15 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని 20జిల్లాల నుంచి సుమారు 200మంది క్రీడాకారులు పాల్గొననున్నారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రెటరీ వింజనంపాటి చంద్రశేఖర్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉచిత వసతి, భోజన ఏర్పాట్లను కల్పించినట్లు తెలిపారు. నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ పోటీలను క్రీడాభిమానులు ఆస్వాదించాలని వారు కోరారు.

సెక్యూరిటీ గార్డుపై మహిళల ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న మహిళలు

దుమ్ముగూడెం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఓ ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన పర్ణశాల రామాలయంలో పనిచేసే సెక్యూరిటీ గార్డు శేఖర్‌పై పలువురు మహిళలు మంగళవారం ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కుమారుకు ఫిర్యాదు చేశారు. శేఖర్ కొందరు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, ఫోన్‌లో చెప్పుకోలేని మాటలతో వేధిస్తున్నాడని స్థానిక మహిళలు అతనిపై ఫిర్యాదు చేశారు. అలాగే మద్యం సేవించి ఆలయంలో ప్రసాదాలు విక్రయిస్తున్నాడని, వాహనాలపై వచ్చే యాత్రికుల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఏ.దాక్షాయిణి, మంగమ్మ, కే.వరలక్ష్మి, ఏ.లక్ష్మి, లీలావతి, ప్రత్యూష, జయ, ప్రణీత, నాగరాణి తదితరులున్నారు.

యూరియా వెతలు

అర్ధరాత్రి నుంచే అన్నదాతల పడిగాపులు

కారేపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలు యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో యూరియా కోసం రైతులు అర్ధరాత్రుల నుంచి పడిగాపులు పడుతున్నారు. వచ్చిన యూరియాను వచ్చినట్టే రైతులకు సంబంధిత అధికారులు కూపన్లు ద్వారా పంపిణీ చేస్తున్నా, రైతులు మాత్రం రోజూ వందలాది సంఖ్యలో సొసైటీ వద్దకు చేరుకుంటున్నారు. అధికారులు యూరియా స్టాక్ రాగానే క్యూలైన్‌ల్లో ఉంటున్న రైతులకు పంపిణీ చేస్తూనే ఉన్నారు. అయితే అర్ధరాత్రుల నుంచి కొందరు భార్యా భర్త, ఇతర కుటుంబసభ్యులతో వచ్చి క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. ఓ వైపు జిల్లా అధికారులు మండలంలో యూరియా కొరతలేదని, సరిపడా నిల్వలున్నాయని చెప్తుతున్నా తమకు అందడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరినాట్లు సాగుతుండడంతో యూరియా వాడకం అధికంగా ఉంటుందని, తరువాత యూరియాతో అంతగా అవసరం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

'గౌతమి'లో రామకోటి ప్రతుల నిమజ్జనం

వేడుకగా సాగిన శోభా యాత్ర


గోదావరి బ్రిడ్జిపై పూజలు నిర్వహిస్తున్న ఈవో రమాదేవి

భద్రాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రామ భక్తులు ఎంతో భక్తి ప్రపత్తులలో భద్రాద్రి రామయ్యను స్మరిస్తూ రాసిన శ్రీరామకోటి ప్రతులను భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు మంగళవారం సంప్రదాయ బద్ధంగా వాటిని పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. ముందుగా శ్రీరామకోటి ప్రతులను లారీల్లో తరలించే ముందు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించగా దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. అనంతరం మేళ తాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణ, శ్రీరామ భక్తుల కోలాటాల నడుమ శ్రీరామ కోటి ప్రతులను భద్రాచలంలోని గోదావరి బ్రిడ్జి మీదకు తీసుకువచ్చారు. ఈ సమయంలో మళ్లీ ప్రత్యేక పూజలను నిర్వహించి పసుపు కుంకుమ, వస్త్రాలను ముందుగా గోదారమ్మకు వైదిక సిబ్బందిసమర్పించారు. ఈసమయంలో శ్రీరామ కోటి ప్రతులను శిరస్సుపై ధరించి శాస్త్రోక్తంగా గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, అర్చకులు పవన్‌కుమారాచార్యులు, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, కృష్ణ స్వామి, శ్రీనివాస్, చెమ్మ రాజు పాల్గొన్నారు.

దేవాయలంలో చోరీకి యత్నం



తల్లాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనరగ్‌లో ముత్యాల మ్మ దేవాలయంలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఈ మేరకు దేవాలయ ద్వారాల తాళాలు పగులగొట్టి హుండీ చోరీకి యత్నం చేశారు. గతంలో రెండుసార్లు ఈ దేవాలయంలో హుండీల చోరీ జరిగింది. దీంతో దేవాలయంలో కానుకల సేకరణకు పటిష్ఠమైన ఇనుప హుండీని ఏర్పాటుచేశారు. దీంతో హుండీని అపహరించేందుకు దొంగలు చేసిన ప్రయత్నం ఫలించలేదు.

భూ తగాదాలో ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో భూ తగాదా విషయంలో కుక్కల సైదులుపై అదే గ్రామానికి చెందిన కుక్కల గోపాలరావు, రాము కలిసి దాడిచేసి గాయపర్చారు. ఈ ఘటనపై బాధితుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైంగిక వేధింపులపై...

మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయమై బాధితురాలు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటోను ఢీకొన్న బొగ్గు టిప్పర్

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి


ఆటోడ్రైవర్ శేషగిరి (ఫైల్)

చుంచుపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పెనగడప వద్ద జరిగిన ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల అందించిన వివరాలిలా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెనగడప వద్ద ఆగి ఉన్న ప్యాసింజర్ ఆటోను బొగ్గు టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ తాళ్ళూరి శేషగిరి (35)ను స్థానికులు కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. కానీ పరిస్థితి విషమించడంతో అతడు మృతి చెందాడు. మృతిడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కొత్తగూడెం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అలాగే ఈ ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో గిరిజన రైతు మృతి

చర్ల, అగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పొలానికి నీరు పెట్టేందుకు మోటార్ ఆన్‌చేసిన క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ గిరిజన రైతు మృతిచెందిన ఘటన చర్ల మండలం కుర్నపల్లిలో సోమవారం జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నందుల చలక గ్రామానికి చెందిన గిరిజన రైతు సోయం వీరాస్వామి(35) చర్ల మండలం కుర్నపల్లి గ్రామంలోని అత్త గారి ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో వరి పంటకు నీరు పెట్టేందుకు సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని పొలం దగ్గరకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్‌చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఆయన ఎంతకూ ఇంటికి రాకపోవడంతో రాత్రి సమయంలో పొలం వద్దకు వెళ్లి వెతకగా విగతజీవిగా పడిఉన్నాడు. వీరాస్వామికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. చర్ల సీఐ రాజువర్మ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ల చోరీపై కేసు నమోదు

బూర్గంపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలెండర్ల చోరీపై సోమవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో ఓ గ్యాస్ ఏజెన్సీలో సిలెండర్లు చోరీకి గురయినట్లు తెలిపారు. గోదాములోని 33 గ్యాస్ సిలెండర్లు చోరీకి గురి కావడంతో గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ గణేష్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం ఎస్‌ఐ ప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

జాతీయ రహదారిపై కారు పల్టీ : ఇద్దరికి గాయాలు

ముదిగొండ, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా.. వరంగల్ జిల్లా నర్సంపేట నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు మంగళవారం ముదిగొండ వద్ద అదుపుతప్పి పల్టీకొట్టడంతో డ్రైవర్ రాజు, యజమాని రంజిత్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ మేరకు ఘటనా స్థలాన్ని సీఐ మురళీ సం దర్శించారు. ఈ మేరకు తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో రేడియం స్టిక్కర్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని హైవే అథారిటీ అధికారులను కోరారు.

చెల్లని చెక్కు కేసులో ఉపాధ్యాయుడికి జైలుశిక్ష

సత్తుపల్లిరూరల్, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి 6నెలల జైలుశిక్షతో పాటు రూ.9.10 లక్షల జరిమానా విధిస్తూ ఆరో అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాసరావు మంగళవారం తీర్పు ఇచ్చారు. ఖమ్మంకు చెందిన బూరుగు జయరాజు అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడుకి 2015లో కల్లూరు మండలం ముచ్చవరంకు చెందిన ముదిగొండ్ల రామనరసింహారావు రూ.8.5 లక్షలు అప్పుగా ఇవ్వగా 6నెలల తర్వాత రూ.9.10 లక్షలకు చెల్లని చెక్కు ఇచ్చారు. ఈ కేసులో 2016 ఫిబ్రవరిలో సత్తుపల్లి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కోర్టులో సీనియర్ న్యాయవాది పిన్నం జానకీ రామారావు దాఖలు చేసిగా.. కేసులో 2023 డిసెంబర్‌లో 6నెలల జైలుశిక్షతో పాటు రూ.9.10లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు వచ్చింది. ప్రతివాది జయరాజు పై కోర్టుకు అప్పీల్ చేయగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయాధికారి శ్రీనివాసరావు పైవిధంగా తీర్పు ఇచ్చారు.

గంజాయి నిందితులపై పీడీ యాక్ట్

చంచల్‌గూడ జైలుకు నిందితుల తరలింపు
ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి

కూసుమంచి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులపై కూసుమంచి పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఈమేరకు ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని చేగొమ్మ క్రాస్‌రోడ్డు సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న కారులో తనిఖీలు నిర్వహించారు. దీంతో రూ.89లక్షల విలువైన 179 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మందపల్లి గ్రామానికి చెందిన పల్లపు రఘు, నల్గొండ జిల్లా మిర్యాలగూడెం మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాజాపాషాను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. కూసుమంచి సీఐ సంజీవ్, నేలకొండపల్లి ఎస్‌ఐ సంతోష్ పీడీ యాక్ట్ పత్రాలను నిందితులకు అందజేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈమేరకు సరిహద్దుల వద్ద చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. గంజాయి, వాడకం, రవాణా వల్ల వచ్చే అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ముఠా అరెస్టు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, హర్యాన ప్రాంతాల్లో నాన్ డ్యూటీ మధ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఖమ్మం నగరంలో ఎక్కువ ధరలకు అక్ర మంగా మధ్యాన్ని అమ్మకాలు చేస్తున్న ముఠా ను ఖమ్మం జిల్లా టాస్కఫోర్స్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ బత్తుల కరుణశ్రీ తెలిపిన వివరాల మేరకు ఇలా..

ఢిల్లీలో ఫుల్ బాటిల్ రూ.500కు తీసుకువచ్చి ఖమ్మంలో రూ.1,500కు అమ్మకం
నిందితుల్ని రిమాండ్ చేసిన ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ


నిందితులతో డీటీఎఫ్ సీఐ కరుణశ్రీ, సిబ్బంది

ఇల్లెందుకు చెందిన అవినాష్, ప్రకాశ్‌నగర్‌కు చెందిన కర్ని టాగూర్ కొరివికి చెందిన హేమంత్‌కుమార్, సువర్ణపురానికి చెందిన దగ్గుపాటి వెంకటేష్ ఒక ముఠాగా ఏర్పాడ్డారు. వీరు ఢిల్లీ, హర్యానా ప్రాంతాలకు వెళ్లి అక్కడ మద్యాన్ని తక్కువ ధరలకు (ట్యాక్స్‌లు లేని విదంగా) ఒక్కో ఫుల్ బాటిల్‌ను రూ.500లకు కొనుగోలు చేస్తున్నారు. రైలు, ఇతర రవాణా మార్గాల ద్వారా ఖమ్మం నగరానికి తరలిస్తున్నారు. ఇలా ఖమ్మానికి తీసుకొచ్చిన మద్యం బాటిల్‌ను రూ.1,500లకు అమ్మకాలు జరుపుతున్నారు. ప్రారంబంలో గుట్టుగా జరిగిన అక్రమ మద్యం వ్యాపారం ఇటీవల కాలంలో విచ్చల విడిగా మారింది. దీంతో ఫిర్యాదుల మేరకు ఖమ్మం డీటీఎఫ్ సీఐ కరుణశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. దీంతో 24 మద్యం బాటిల్స్‌తో వెళ్తున్న నిందితుల్ని పట్టుకొని మద్యంతో పాటుగా నిందితుల్ని రిమాండ్ చేసినట్లు సీఐ కరుణ శ్రీ తెలిపారు. ఎస్‌ఐ కుమారస్వామి, సిబ్బంది మధుసూదన్, వలరాజు, నాగేశ్వరరావు, విశ్వనాధం, రణాప్రసాద్, నరేశ్, నజీమా, నిర్మల దాడుల్లో పాల్గొన్నారు.

8 మంది మావోయిస్టులు లొంగుబాటు

వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81, 141 బెటాలియన్ల అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు శాఖ కల్పిస్తున్న సదుపాయాల గురించి తెలుసుకుని నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది సభ్యులు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఒక మహిళా మావోయిస్టుతో కలిపి పీపీసీఎం/ ఏసీఎం ఒకరు, ఒక పార్టీ మెంబర్, ఆరుగురు మిలీషియా సభ్యులున్నారు. వెట్టి సోమ్దా, ముచకి లక్మె, ఓయం లక్ష్మణ్, పోడియం కోసా, ముడం కోసం, మడవి నందు, కోరం సోముడు, మడవి ఉరలు లొంగిపోయినట్టు ఎస్పీ తెలిపారు. కాగా ఇప్పటివరకు 314 మంది మావోయిస్టులు ఆపరేషన్ చేయూత సౌకర్యాలు నచ్చి లొంగిపోయినట్టు ఆయన తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున రూ.2లక్షలు అందించినట్టు ఆయన తెలిపారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడనాడి జనజీవన స్రవంతిలో కలిసి శాంతియుత జీవితం గడపాలని ఈ సందర్బంగా ఆయన కోరారు.

లారీ తగిలిన క్లీనర్ మృతి

ఖమ్మంక్రైం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బందేలమూరు గ్రామానికి చెందిన లారీడ్రైవర్ బత్తుల ఇస్తారి, రంగారెడ్డి జిల్లా అరుట్ల గ్రామానికి చెందిన చిందం శ్రీశైలం(50) అనే క్లీనర్‌తో హైదరాబాదు నుంచి ఫెర్టిలైజర్ లోడ్‌తో సోమవారం ఖమ్మంకు వచ్చారు. రాపర్తినగర్ బైపాస్‌రోడ్డు సమీ పంలో మలుపు తిప్పుతుండగా అదే లారీక్లీనర్ శ్రీశైలం వాహనాలు రాకుండా సైడ్ చెబుతున్న క్రమంలో డ్రైవర్ ఒక్కసారిగా లారీని ముందుక పోనివ్వడంతో క్లీనర్ శ్రీశైలంకు లారీ తగిలింది. దీంతో నగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాదు కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు.

వ్యక్తిపై దాడి.. ఆరుగురిపై కేసు

పాల్వంచ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : దారికాచి ఓ వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులపై పాల్వంచ రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని బసవతారక కాలనీకి చెందిన బాష్యబోయిన మురళీకృష్ణ సోమవారం రాత్రి పాల్వంచ నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో బ్రిక్స్ ప్యాక్టరీ వద్ద అతనిపై ఆరుగురు వ్యక్తులు దాడి చేశారు. మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

LAND FOR SALE
ఖమ్మం శ్రీనివాసనగర్ అయ్యప్పస్వామి గుడి డౌన్ లో వివేకవర్ధిని స్కూల్‌కి సమీపంలో తూర్పు ఫేసింగ్ 215 చదరపు గజముల స్థలం అమ్మకమునకు కలదు. సెల్ 6305039742
AJM-231881

LAND FOR SALE
★ Industry Land AC 1.00 Gts (Pre-Viously Sai Sruthi Granite Factory, Arempula) Open land in Sy.No.119 of Kondapuram, KMM Rural for Sale.Cell.No: 9949708057
AJW-4318

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వదేశాగమనము/ విదేశీయానం | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం
షష్ఠిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి
పదవీవిరమణ | వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds Khammam • B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347



ఆంధ్రజ్యోతి లో మీ శ్రేయస్సు కోరే వారికి అందించండి...
పదవీ విరమణ శుభాకాంక్షలు
మీ ఆత్మీయులలో..
మీ సహోద్యోగులలో...
మీ కుటుంబ సభ్యులలో...
ఎవరైనా రిటైర్ అవుతున్నారా ?
అందిస్తుంది సులువైన మార్గం పదవీ విరమణ ప్రకటనలకు
25%
EP 15%
రాయితీ కల్పిస్తుంది
అలాంటి వారు తమ విధి నిర్వాహణలోని అనుభవాలు, సలహాలు, సూచనలు ఇచ్చి మీ అభివృద్ధికి మార్గదర్శకులై ఉంటారు. అయితే వారికి తీపి గుర్తుగా, మీ అమూల్యమైన కానుకగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి... పదవీ విరమణ శుభాకాంక్షల అక్షర సుమాంజలులు...
ఆంధ్రజ్యోతి కార్యాలయం ప్రకటనల విభాగము
సంప్రదించండి : 9985401672
❖ ఖమ్మం : సెల్ : 9985406151, 9985401698
❖ భద్రాచలం : సెల్ : 9985411347 ❖ సత్తుపల్లి : సెల్ 9985411343
❖ కొత్త గూడెం : సెల్ : 9985400885.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
బుధవారం 27 ఆగస్టు 2025
ఖమ్మం సిటీ
ZONE 8
• ఖమ్మం • రఘునాథపాలెం
• ఖమ్మం రూరల్
• తిరుమలాయపాలెం
• కూసుమంచి
• నేలకొండపల్లి • కామేపల్లి



క్షయ నిర్మూలనకు కృషి చేయండి

తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

తిరుమలాయపాలెం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వామి కావాలని తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అవినాష్, మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సునిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా క్షయవ్యాధి అనుమానితులుంటే వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు క్షయవ్యాధిగ్రస్తులకు మందులతో పాటు రూ.వెయ్యి వారి అకౌంట్‌లో జమచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, ఏఎన్ఎం నాగలక్ష్మి, ప్రేమలత, ఉపేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

- ఉచితంగా ప్రతిమల పంపిణీ
- వర్షంలోనూ పూజాసామగ్రి కొనుగోలు చేసిన భక్తులు



పత్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు





పూలు కొనుగోలు చేస్తున్న భక్తులు

ఖమ్మంఖానాపురం హవేలి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి హాజుయ్యారు. నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, కాల్వొడ్డు వీరాంజనేయస్వామి ఆలయం, పర్ణశాల రామాలయం, బాలగణపతి ఆలయాలలో సుమారు 500 విగ్రహాలను భక్తులకు అందించారు. స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వినోద్ లాహోటి ఆధ్వర్యంలో 2వేలు మట్టి గణపతులు అందించారు. బ్రాహ్మణబజార్‌లో 36అడుగుల విశ్వరూప త్రిశూండ్ మహాగణపతి కొలువుదీరనున్నారు.

భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో..

నేలకొండపల్లి: మట్టి గణపతులను పూజించాలని భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు పిలుపునిచ్చారు. నేలకొండపల్లి, భక్తరామదాసుసర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలనుపంపిణీ చేశారు. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 400మట్టి వినాయకులను పంపిణీ చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారి దండా రవీందర్, ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి, మాజీ అధ్యక్షుడు యలమద్ది లెనిన్, పొన్నగాని శ్రీను. వెల్లంపల్లి శ్రీనివాస్, గెల్లా జగన్మోహన్ రావు సభ్యులు వాసం లక్ష్మయ్య, పచ్చా తిరుపతయ్య, కనపర్తి కోటేశ్వరరావు, రాయల రమేష్, మందడపు వెంకటేశ్వర్లు, ఖాసీం, వల్లంచెట్ల భాస్కరరావు, దేవరశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి
కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్



ఏడీఈ కోక్యానాయక్

కూసుమంచి: వినాయక చవితి పందిళ్లలో నిర్వాహకులు భద్రతా చర్యలు తీసుకోవాలని కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్ సూచించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాలను విద్యుత్‌లైన్లకింద, ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన ఏర్పాటు చేయొద్దని తెలిపారు. నాణ్యత గల ఎంసీబీలను అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్ వైర్లు ఇనుప పైపులకు తాకకుండా చూసుకోవాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరక్కుండా జాగ్రత్త పడాలని తెలిపారు. విద్యుత్ అధికారుల అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే 1912టోల్‌నెంబరుకు డయల్ చేయాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ సిబ్బంది గణేష్ మండపాలను తప్పనిసరిగా సందర్శించాలని, వైరింగ్‌ను తనిఖీ చేయాలని,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నవరాత్రులు జరుపుకోవాలని కోరారు.



బ్రాహ్మణబజార్‌లో 36 అడుగుల గణేషుడు



విగ్రహాలను పంపిణీ చేస్తున్న దేవాదాయశాఖ ఏసీ వీరస్వామి



స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..



భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో..

విద్యుత్ ప్రమాదపుటంచున మండపాలు



ఖమ్మంకార్పొరేషన్: ఖమ్మంనగరంలో కొన్ని ప్రాంతాల్లో గణపయ్య మండపాలు విద్యుత్‌తీగల చెంతనే ఏర్పాటు చేశారు. మండపాలను ఇనుప కడ్డిలు, ప్లాస్టిక్ కవర్లతో నిర్మాణాలు చేయటంతో వర్షాలు నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మండపాలను విద్యుత్ స్థంభాలకు సమీపంలో, తీగల కిందన ఈనిర్మాణాలు జరిగాయి. మరి కొంతమంది ఏకంగా విద్యుత్ స్థంభాలకు గణేష్ మండపాలను కట్టి నిర్మాణాలు చేశారు. ప్రజలు విద్యుత్‌శాఖ ఆదేశాలను పాటించాలని విద్యుత్‌శాఖ ఖమ్మం డీఈ రామారావు కోరారు.

లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రారంభం

ఖమ్మంలీగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లాసైనికసంక్షేమ ప్రాంతీయ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను రాష్ట్ర న్యాయసేవాధికాసంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్యాంకోషి ద్వారా మంగళవారం ఇన్‌చార్జి జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి ప్రారంభించారు. జిల్లాన్యాయసేవాధికార సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సెక్రటరీ ఎం.కల్పన, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాస్, మీడియోటర్ యుగంధర్, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.



లాభసాటి వ్యాపారాలను ప్రారంభించాలి

- ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- మహిళా ప్రాంగణంలో ఉపాధి శిక్షణ పరిశీలన



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మహిళలు లాభసాటి వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం నగరంలోని టేకులపల్లిలోని మహిళా ప్రాంగణాన్ని సందర్శించారు. మౌళిక సదుపాయాల గురించి మహిళా ప్రాంగణం మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు.మహిళలకు అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులు, ఉపాధి శిక్షణ టైలరింగ్,మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్స్ శిక్షణ, ఏఎన్ఎం నర్సింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్, ట్యాలీ, అకౌంటింగ్, కంప్యూటర్, డీసీఏ, డీటీపీ, డ్రైవింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్స్, తదితర కోర్సులు, టీచింగ్‌రూమ్స్, వసతి గృహం,డైనింగ్‌హాల్‌లను పరిశీలించారు. గ్రామీణప్రాంత మహిళలకు వ్యవసాయరంగంలో వినూత్న పద్దతుల ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు, స్వయం ఉపాధికి అందిస్తున్న డ్రోన్‌శిక్షణను కలెక్టర్ పరిశీలించారు.డ్రోన్‌పైలెట్ శిక్షణ వివరాలను మహిళలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్, కంప్యూటర్ విద్య, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో పలుఅంశాలు చర్చించారు. ఇక్కడ డ్రోన్ వాడకంపై కూడా శిక్షణ ఇవ్వటం అభినందనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో డ్రోన్ వినియోగం పెరుగుతుందని అన్నారు. టీవి, సెల్ ఫోన్ లాగా డ్రోన్ కూడా రాబోయే రోజుల్లో సర్వసాధారణం అవుతుందని అన్నారు. డ్రోన్ శిక్షణ తర్వాత అభ్యర్థులు భవిష్యత్తులో మరొకరికి ఉపాధి అందించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత, సిబ్బంది సరస్వతి, స్పందన, మల్లిక, విజయ్ కుమార్, సుధీర్, సుకన్య, మౌనిక, లాలయ్య, జయ, శారద, అనిత, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి ఉన్నారు.

సరిపడా యూరియా నిల్వలు: ఏవో

తిరుమలాయపాలెం,ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సరిపడా యూరియా నిలవలున్నాయని, సొసైటీల ద్వారా యూరియా అందిస్తున్నామని ఏవో సీతారాంరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. యూరియాకోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ప్రైవేటు వ్యాపారులు బ్లాక్‌లో అమ్మితే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తిరుమలాయపాలెం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిరిపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ అప్రత్తంగా ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. ఖమ్మం వైపు నుంచి వరంగల్ వైపు వెళుతున్న ట్రాలీ కంటెయినర్ ఖమ్మం వైపు వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలేరో వాహనం ముందుభాగం ధ్వంసం అయింది.



మార్కెట్ అక్రమార్కులపై.. చర్యలేవీ?

(5వ పేజీ తరువాయి)

వ్యాపారి రెండు నెలల ఫీజు బకాయిలు చెల్లించడంతోనే ఐడీని అన్‌బ్లాక్ చేశామని మార్కెట్ అధికారులు పేర్కొనడం గమనార్హం.

నోటీసులు జారీ చేయని అధికారులు.. నకిలీ బిల్లులతో పత్తిని అమ్మాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వ్యాపారికి మార్కెట్ అధికారులు సానుకూలంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు సదరు వ్యాపారికి నోటీసులు కూడా జారీ చేయకపోవడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నకిలీ బిల్లు వ్యవహారంపై ముందుగానే గుట్టు చప్పుడు కాకుండా అన్ని వ్యవహారాలు మాట్లాడుకొన్నారని, ఆ తరువాత విషయం సోషల్ మీడియా ద్వారా గుట్టురట్టయి వైరల్ కావడంతోనే మార్కెట్ అధికారులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. ముందుగానే అన్నీ మాట్లాడుకొని నింపాదిగా అంతా తెలిశాక కేసులు ఎందుకని అసలు నకిలీ బిల్లు విషయం బయటకు రాగానే నోటీసులు ఎందుకు పంపలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత నాలుగైదు సంవత్సరాల నుంచి మార్కెట్ ఫీజు బకాయి ఉన్న వ్యాపారులను ఇతరుల పేరుపై వ్యాపారం చేయకుండా నిరోధించాలని, అలాంటి వారిని మార్కెట్‌లోకి ప్రవేశం లేకుండా శాశ్వతంగా నిషేధించాలని పలువురు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

ఖమ్మంక్రైం,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):నగరంలోని సారథీనగర్‌లో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారంతో త్రీటౌన్‌పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళతోపాటు మరోమహిళను, విటుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ప్రజాసమస్యలు విస్మరిస్తే
కాంగ్రెస్‌కూ.. గతప్రభుత్వానికి పట్టిన గతే

- సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి రమేష్
- కూసుమంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కూసుమంచి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను విస్మరిస్తే కాంగ్రెస్‌కు గత బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ హెచ్చరించారు. మంగళవారం కూసుమంచి తహసీల్దార్,ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. డబుల్ ఇళ్ల నివాసితుల సమస్యలపై మూడురోజులుగా సర్వే నిర్వహించారు. ఈసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కూసుమంచిలోని డబుల్ ఇళ్ల నివాసితులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత రహదారులు లేవని, పారిశుధ్య సమస్య కారణంగా దోమల బెడదతో అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సమస్య, స్ట్రీట్‌లైట్లు లేవని సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రామచంద్రరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, రమణారెడ్డి, షన్మతిరావు, గంగాధర్, గురుమూర్తి, కర్ణబాబు, గన్యా పాల్గొన్నారు.



ఇండోర్ ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన ఉంది

- ఆరు విభాగాలుగా ఇంటింటి చెత్త సేకరణ
- డివైడర్లు, కార్మికుల వేతనాల్లో ఖమ్మం భేష్
- మేయర్ పునుకొల్లు నీరజ
- విలేకరుల సమావేశంలో ఇండోర్ పర్యటన వివరాల వెల్లడి



మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఇండోర్ ప్రజలకు పారిశుధ్యంపై సంపూర్ణ అవగాహన ఉందని, తద్వారా ఈ పట్టణం దేశంలోనే పారిశుధ్యంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకుంటుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండోర్ పర్యటన వివరాలను వెల్లడించారు. ఇక్కడి ప్రజలు తడి, పొడి, హానికరమైన, మెడికల్ వ్యర్థాలు, మట్టి, ప్లాస్టిక్ విభాగాలుగా చెత్త సేకరణ చేసి డంపింగ్ యార్డు లేకుండానే ఏ రోజు వ్యర్థాలను ఆదేరోజు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రతీరోజు ఇంటింటి చెత్తసేకరణ జరుగుతుందన్నారు. 25 లక్షల జనాభా ఉన్న ఇండోర్‌లో 22 జోన్‌లుగా విభజన జరిగిందని, కంట్రోల్‌రూమ్ పర్యవేక్షణలో పారిశుధ్య వాహనాలను ఖచ్చితంగా మానటరింగ్ చేస్తున్నారని వివరించారు. చిన్న పిల్లవాడు చాక్లెట్ తిన్నా కూడా జేబులో చాక్లెట్ కవర్ పెట్టుకునే విధానం అమలులో ఉందని, కేవలం జరిమానాల ద్వారానే ఏడాదికి ఇండోర్ పట్టణానికి రూ.27 కోట్లు ఆదాయం అందుతుందన్నారు. కొన్నినివాసాల్లో ఇళ్లలోని చెత్తను ఇంట్లోనే కంపోస్టింగ్ ఎరువులు తయారు చేస్తే వాటిని ఇండోర్ అధికారులు కొనుగోలు చేస్తున్నారని వివరించారు. అండర్ డ్రైనేజీ విధానం మంచిగా పనిచేయటంతో డ్రైయినేజీ వ్యర్థాల సమస్యలు లేవన్నారు.

మంత్రి తుమ్మల సహకారంతో

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రోత్సహించటంతోనే ఇండోర్ పర్యాటనకు వెళ్లామని మేయర్ పునుకొల్లు నీరజ వివరించారు. ఖమ్మంలోను అండర్ డ్రెయినేజీకి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిధులు మంజూరు చేయించి వేగంగా పనులు జరిగేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మేయర్ హర్షం వ్యక్తం చేశారు. రహదారులు, అభివృద్ధి, డివైడర్లు నిర్వాహణలో ఖమ్మం నగరం భేష్‌గా ఉందన్నారు. కేవలం పారిశుధ్యంలో మాత్రమే ఇండోర్‌కు దేశంలో నెంబర్ 1 స్థానం ఉందన్నారు. పారిశుధ్య కార్మికులకు కూడా ఇండోర్ కంటే ఖమ్మంలో ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లుమలీదు వెంకటేశ్వర్లు వారి అనుభవాలు వెల్లడించారు.

ప్రజా ప్రభుత్వానికి క్షీరాభిషేకం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ప్రజాప్రభుత్వ అధినేతలు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటాలకు మంగళవారం ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. పదోన్నతుల ప్రక్రియలో వచ్చిన అవాంతరాలను అధిగమించి సమర్థవంతంగా పూర్తిచేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన అన్నిరకాల సమస్యలను ప్రజా ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.యాదగిరి, జిల్లాప్రధాన కార్యదర్శి యస్.కె.మన్సూర్, జిల్లా బాధ్యులు పి.వెంకన్న, టి.సుధాకర్, డి.ఆర్.కె.రాజు, వై.నాగేశ్వరరావు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి,భట్టి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న సైదులు

Sri Chaitanya
INSTITUTE OF TECHNOLOGY & RESEARCH
UGC AUTONOMOUS INSTITUTION
KHAMMAM

SPOT ADMISSIONS NOTIFICATION FOR B.TECH COURSES (TGEAPCET) - 2025

Applications are invited for **SPOT ADMISSIONS** to B.Tech Courses under **TGEAPCET-2025** for the leftover/unfilled seats for the **ACADEMIC YEAR 2025-26.**

AVAILABLE SPOT ADMISSION BRANCHES

Courses	CIVIL	EEE	MEC	ECE
2025-26 Intake	30	60	30	120

Applications can be downloaded from the website **www.scitr.edu.in** or from the office and to submit filled in applications along with certificates during all the working hours on or before **29-08-2025 by 05.00PM.** The eligibility and admission under this category will be as per the order of the Commissioner, Technical Education & Convenor, **TGEAPCET-2025 Admissions.**

Date: 25-08-2025 | PRINCIPAL | Secretary & Correspondent



కోతుల బెడదను అరికట్టాలి

పెనుబల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోతుల మూలంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుదని, వ్యవసాయం కుదేలవుతుందని, ఇళ్ల పెరట్లో పెంచుకునే కూరగాయలు, పూల, పండ్ల మొక్కలు తదితర పంటలను కోతులు ధ్వంసం చేస్తున్నారని వాటిని అరికట్టేందుకు పలు రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వీఎంబంజర్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోతుల వల్ల పంటలే కాకుండా ప్రజలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు ఆర్థికంగా ఉన్న వారు సోలార్‌లు అమర్చుకుంటే పేదలు వాటి బారీనపడాల్సి వస్తుందన్నారు. కోతులు గ్రామాలకు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రవీణ్

పెనుబల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) మండల నూతన కమిటీని మంగళవారం పెనుబల్లిలో ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా విద్యార్థుల కోసం ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తుందన్నారు. పెనుబల్లిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తేళ్లూరి సందీప్, భూక్యా బాలాజీలను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేష, జిల్లా కమిటీ సభ్యులు వెంకటలక్ష్మి, సత్యం, పర్వీన్, ప్రవీణ్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు అరుణాదేవికి సన్మానం



అరుణాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముదిగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ముత్తారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అరుణాదేవికి ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా వేదాస్ సంస్థ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఇటీవల ఎంపిక చేసింది. ఈమేరకు మంగళవారం ముత్తారం పాఠశాలలో అరుణాదేవికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాళేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కారేపల్లి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మండల విద్యావనరుల కేంద్రంలో విద్యార్థుల కోసం ఆధార్‌కార్డు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈవో జయరాజు తెలిపారు. మంగళవారం కార్డులను ఎంఈవో పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ కార్డులు అందించేంతవరకు కేంద్రం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఐదు నుంచి, పదవతరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అవసరమైన ఆధార్‌కార్డులను అందించేందుకు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నిబంధలను ఉపసంహరించుకోవాలి



పత్తి పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం బృందం

ఏన్కూరు, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచే పత్తి కొనుగోలు చేయాలనే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధనను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. జన్నారం గ్రామంలో మంగళవారం రైతుసంఘం బృందం పత్తి పంటలను పరిశీలించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో రైతులు అడపా రామారావు, నండూరి శ్రీనివాసరావు, స్వర్ణ కృష్ణారావు, పుచ్చకాయల వెంకన్న, నేలపట్ల వెంకటేశ్వరరావు, పోతురాజు వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

స్వచ్ఛందంగా బ్లీచింగ్ చల్లిన యువకులు



బ్లీచింగ్ చల్లుతున్న యువకులు

వైరా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలై మూడునెలలైనా నిత్యం వర్షాలు కురుస్తూ మురుగునీటితో తమ ఆవాసాలన్నీ అపరిశుభ్రంగా ఉండటంతో కొంతమంది యువకులు ముందుకొచ్చి స్వచ్ఛందంగా శ్రమదానంతో బ్లీచింగ్ చల్లుకున్నారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని 17,18 వార్డులైన పల్లిపాడులో రాయల నరేష్ అనే యువకుడి ఆధ్వర్యంలో కొంత మంది యువకులు నడుంబిగించి తమ సొంత ఖర్చులతో బ్లీచింగ్‌ను కొనుగోలు చేసి రోడ్లపక్కన చల్లారు. మురుగునీటితో దోమలు స్వైరవిహారం చేస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలతుండటంతో ఇక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కనీసం పిడికెడు బ్లీచింగ్ పౌడర్ చల్లటం కానీ, పాగింగ్ వంటి శానిటేషన్ చేసే పరిస్థితి లేకపోవడంతో సొంత ఖర్చులతో యువకులు బ్లీచింగ్‌ను కొనుగోలు చేసి చల్లారు. వీరిని స్థానికులు అభినందించారు.

మార్కెట్ అక్రమార్కులపై.. చర్యలేవీ?

(5వ పేజీ తరువాయి)

వ్యాపారి రెండు నెలల ఫీజు బకాయిలు చెల్లించడంతోనే ఐడీని అన్‌బ్లాక్ చేశామని మార్కెట్ అధికారులు పేర్కొనడం గమనార్హం.

నోటీసులు జారీ చేయని అధికారులు..

నకిలీ బిల్లులతో పత్తిని అమ్మాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వ్యాపారికి మార్కెట్ అధికారులు సానుకూలంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు సదరు వ్యాపారికి నోటీసులు కూడా జారీ చేయకపోవడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నకిలీ బిల్లు వ్యవహారంపై ముందుగానే గుట్టు చప్పుడు కాకుండా అన్ని వ్యవహారాలు మాట్లాడుకొన్నారని, ఆ తరువాత విషయం సోషల్ మీడియా ద్వారా గుట్టురట్టయి వైరల్ కావడంతోనే మార్కెట్ అధికారులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. ముందుగానే అన్నీ మాట్లాడుకొని నింపాదిగా అంతా తెలిశాక కేసులు ఎందుకని అసలు నకిలీ బిల్లు విషయం బయటకు రాగానే నోటీసులు ఎందుకు పంపలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత నాలుగైదు సంవత్సరాల నుంచి మార్కెట్ ఫీజు బకాయి ఉన్న వ్యాపారులను ఇతరుల పేరుపై వ్యాపారం చేయకుండా నిరోధించాలని, అలాంటి వారిని మార్కెట్‌లోకి ప్రవేశం లేకుండా శాశ్వతంగా నిషేధించాలని పలువురు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం



కల్లూరులో మట్టి వినాయక విగ్రహాలపై ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

వినాయక చవితి పండుగ సందర్భంగా వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల వ్యాప్తంగా మట్టి విగ్రహాలను అధికారులు, పాఠశాలల యాజమాన్యాలు, రాజకీయ పార్టీల నాయకులు ప్రజలక అందజేశారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎఫ్‌డీవో వాడపల్లి మంజులతో పాటు పలువురు వినాయక ప్రతిమలను అందించారు. మట్టి వినాయక గణపతులనే వాడండి-- పర్యావరణాన్ని కాపాడండి, అనే నినాదాలతో పాఠశాల విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని అధికారులు కోరారు. వినాయక మండపాలను రంగురంగుల పూలతో అందంగా తీర్చిదిద్దారు.



సత్తుపల్లిలో మట్టి ప్రతిమలను అందిస్తున్న సండ్ర వెంకటవీరయ్య



కల్లూరులో గణేష్ ప్రతిమలను అందిస్తున్న నాయకులు



వైరాలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు



పెనుబల్లిలో...





సత్తుపల్లిలో గణపతి ప్రతిమ, మొక్కలు అందిస్తున్న ఎఫ్‌డీవో మంజుల, ఉత్సవకమిటీ సభ్యులు



వైరాలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



మధిరలో మట్టి గణపతి ప్రతిమలు తయారుచేస్తున్న విద్యార్థినులు

జాగ్రత్తలు తీసుకోవాలి

● డీపీవో ఆశాలత



మాట్లాడుతున్న డీపీవో ఆశాలత

ఏన్కూరు, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అధికారులను ఆదేశించారు. మండలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో మంగళవారం ఏన్కూరులో పర్యటించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధుల తీవ్రత ఉన్న గ్రామాల్లో హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జీవీఎస్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి రామ్‌కి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రిజ్ వితరణ

వైరా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఏరియా ఆసుపత్రికి ఒక స్వచ్ఛంద సంస్థ ఫ్రిజ్‌ను వితరణగా అందజేసింది. పసిపిల్లలకు సంబంధించిన వ్యాక్సిన్, రోడ్డు ప్రమాదాలు, ఇతర ఎమర్జెన్సీ మెడిసిన్‌ను నిల్వ ఉంచేందుకుగానూ ఈ ఫ్రిజ్‌ను అందజేశారు. ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ బాణోతు బాలు, ఎస్ఐ పి.రామారావు మంగళవారం ఈ ఫ్రిజ్ స్విచ్ ఆన్ చేసి ఉపయోగంలోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కారేపల్లిలో వర్షం

కారేపల్లి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం భారీగా వర్షం కురిసింది. దీంతో మెట్టపంటలకు ప్రాణంపోసినట్లు అయింది. ఎండలకు పంటలు ఎండిపోతున్న తరుణంలో మంగళవారం వర్షం కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రెషర్స్‌డే వేడుకలు

ఎర్రుపాలెం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సర్దార్ జమలాపురం కేశవరావు జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను మంగళవారం జమలాపురం గ్రామంలోని బాలాజీ భవన్‌లో నిర్వహించారు. త్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ మిరియాల శ్యాంప్రసాద్, నాగిరెడ్డి సౌజన్య రమేష్, ఎర్రబోలు నాగేశ్వరరావు, అధ్యాపకులు గద్దల సత్యనారాయణ, గోపయ్య నాయక్, ఆకుల రవి, అయిలూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎమ్మార్పీకీ ఎరువులు విక్రయించాలి

» జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

తల్లాడ, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీచేశారు. ఆయా షాపుల్లో యూరియా ఇతర ఎరువుల నిలవలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్స్‌ను పరిశీలించారు. ఈకార్యక్రమంలో మండల ఏవో ఎండీ తాజుద్దీన్, ఏఈవోలు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలను కల్లూరులోనే కొనసాగించాలి

కల్లూరు, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి) గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను కల్లూరులోనే యథావిధిగా కొనసాగించాలని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కల్లూరులో సబ్ కలెక్టర్ కార్యాలయంలో వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోతు దశరథ్‌నాయక్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా కల్లూరులో కొనసాతున్న ఈ పాఠశాలను సత్తుపల్లికి తరలించడం తగదన్నారు. కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రం పరిధిలో గల పలు మండలాల్లో వందలాది మంది గిరిజన పేద విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారని చెప్పారు. ఐటీడీఏ అధికారులు ఈ పాఠశాలను కల్లూరులోనే యథావిధిగా కొనసాగేలా పునః పరిశీలన చేయాలన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థినీలు అస్వస్థత ఘటనలపై వాస్తవాలను వెలికితీయకుండా ఏకపక్షంగా ఇక్కడ నుంచి తరలించడం సమర్థనీయం కాదన్నారు. ఇక్కడ పాఠశాలను కొనసాగించక పోతే ఆందోళన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు గుగులోతు కృష్ణనాయక్, మండల అధ్యక్షుడు బానోతు నందునాయక్, తల్లాడ మండల అధ్యక్షుడు భూక్యా రవినాయక్, భూక్యా శ్రీనునాయక్ నాగనాయక్, మనోజ్‌నాయక్ వంశీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

వైరా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతకు ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన వైరాలో సీపీఎం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అవసరాల మేరకు యూరియా అందించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే యూరియా సరఫరా పెంచి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పార్టీ గెలుపు కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, దొంతెబోయిన నాగేశ్వరరావు, కె.నరేంద్ర, బాణాల శ్రీనివాసరావు, చెరుకుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరరావు, బదావత్ శ్రీనివాసరావు, వజ్జా రామారావు, బోయినపల్లి శ్రీనివాసరావు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, తూము సుధాకర్, మాగంటి తిరుమలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సాగాలి

బోనకల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరు ముం దుకు సాగాలని మధిర సీఐ మధు సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో మంగళవారం పురమ్మతల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సంగాపు దుర్గా ప్రసాద్ సహకారంతో రూ. 25వేల వ్యయంతో 50 పనస మొక్కలను రోడ్డు ప్రక్కన నాటే కార్యక్రమానికి ముఖ్య అతిదిగా సీఐ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పొదిలి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సైదులు, చిట్టింశెట్టి రాము, సంగాపు శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, చెల్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న సీఐ మధు

మదర్‌థెరిస్సా ఆశయాలు సాధించాలి

వైరా: వైరాలో మంగళవారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను నిర్వహించారు. శారదా నర్సింగ్ హోమ్ సమీపంలోని మదర్‌థెరిస్సా విగ్రహానికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా ఎస్ఐ పి.రామారావు, మునిసిపల్ మాజీ చైర్మన్, వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదర్ థెరిస్సా కమిటీ అధ్యక్షుడు మోటపోతుల జోజి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పణి తి సైదులు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, డి.కోటయ్య, పూర్ణకంటి నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, యామాల గోపాలరావు, ధార్న రాజశేఖర్, వై.బుచ్చిరామారావు, ఓర్సు శ్రీనివాసరావు, పూర్ణకంటి రామారావు పాల్గొన్నారు.

సత్తుపల్లి: ఈ ప్రపంచంలో ఐకమత్యాన్ని చూపగలిగేది కేవలం ప్రేమమాత్రమేనని మదర్‌థెరిస్సా చెప్పారని, మనమంతా ఆమె బాటలో నడవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు దయానంద్ విజయకుమార్ అన్నారు. మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధిర రూరల్: మధిర మండలం ఆత్కూరు గ్రామంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్లో మంగళవారం మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బట్టా అంజన్‌బాబు మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీహెచ్.చందు, ఇన్‌చార్జ్ డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడలో మదర్‌థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌సెంటర్‌లోని మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద జయంతి వేడుకలు జరిగాయి. ఈకార్యక్రమంలో కొత్తూరు ఫణి, గుడిపల్లి నారాయణ, దుగ్గిదేవర అజయ్‌కుమార్, ఎండీ ముస్తఫా, మునుకూరు అప్పిరెడ్డి, వేముల నరసింహారావు, షేక్ మెహరాజ్, గురిజాల నారాయణ రావు, గుమ్మా నరేష్, ఇస్సేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న బొర్రా రాజశేఖర్, ఎస్ఐ రామారావు తదితరులు



సత్తుపల్లిలో మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దయానంద్



మధిరలో...